www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 22 జనవరి 2024
5
పశ్చిమ గోదావరి

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాలలో బీచ్‌కు ఉదయమే తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారుల ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో, ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సరివే, కొబ్బరి తోటల్లో సహపంతి భోజనాలు చేసి సేదతీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పర్యాటకులు ఆనందంగా గడిపారు.

నీరందదు.. సాగు సాగదు..!

పూర్తికాని రబీ నాట్లు

ఆచంట వేమవరంలో నీరందక బీడు భూములను తలపిస్తున్న పంట పొలాలు

ప్రజాశక్తి - ఆచంట

రైతులను సాగునీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. సంక్రాంతి నేపథ్యంలో వ్యవసాయ పనులకు కాస్త విరామం ఇచ్చిన అన్నదాతలు మళ్లీ సాగుపై దృష్టి పెట్టారు. పంట కాలువల్లో నీటి మట్టాలు పడిపోవడంతో శివారు భూములకు నీరందక పనులు ముందుకు సాగడం లేదు. మండల పరిధిలో సుమారు 10,350 ఎకరాల్లో దాళ్వా సాగవుతోంది. సార్వా మాసూళ్ల ఆలస్యం, ప్రస్తుతం నీటిఎద్దడి రీత్యా దాళ్వా సాగు మందకొడిగా సాగుతోంది. జనవరి 15 నాటికే నాట్లు పూర్తి చేయాలని అధికారులు పదేపదే సూచిస్తున్న క్షేత్రస్థాయిలో నేటికీ 50 శాతం కూడా నాట్లు పడని పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే రెండు పంటలకు సకాలంలో నీరందక ఖరీఫ్ సాగు ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో రబీ సాగుకూ నీటి ఎద్దడి తప్పడం లేదు. ప్రస్తుతం నీరందక దమ్ము చేయడంలోనూ జాప్యం నెలకొంది. గత సంవత్సరం సెప్టెంబర్ మొదటి వారం వరకూ నాట్లు సాగాయి. దీనివల్ల డిసెంబర్ మొదటి వారంలో పంట కోత సమయానికి వచ్చిన మిచౌంగ్ తుపాన్‌తో అన్నదాతలు పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయారు. మాసూళ్ల సైతం బాగా ఆలస్యమయ్యాయి. ఫలితంగా దాళ్వా సాగుపై ప్రభావం పడింది. దీంతో నాట్లు కొనసాగుతుండడంతో మూడో పంటగా సాగుచేసే ఆరుతడి పంటలు మినుము, పెసర, పిల్లి పెసర, జనుము, జీలుగ తదితరాలు సాగు చేసేవారు. రబీ సాగు ఆలస్యం వల్ల గత ఐదేళ్లుగా మూడో పంట సాధ్యం కావడం లేదు. ఫలితంగా రైతులు నష్టపోతుండగా ఆ కాలంలో వ్యవసాయ కూలీలు సైతం పనుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఆచంట, పెనుమంచిలి, ఆచంట వేమవరం, కొడమంచిలి, కరుగోరుమిల్లి, కందరవల్లి, శేషమ్మ చెరువు, కోడేరు, పెదమల్లం, వల్లూరు గ్రామాల పరిధిలో శివారు భూములకు



ఆచంటలో ఇంజిన్ ద్వారా పొలాలకు నీరు తోడుతున్న దృశ్యం

ఆచంట నుంచి కానుపోతుగుంట వరకూ పూడుకుపోయిన పంట బోదె

నీటిఎద్దడి తీవ్రంగా ఉంది. ఈ భూములన్నీ జగ్గరాజు కాలువ, ఆచంట-2, కొడమంచిలి, కందరవల్లి ఛానల్స్‌పై ఆధారపడి సాగవుతున్నాయి. ప్రస్తుతం ఈ కాలువలతోపాటు ఉపకాల్వలు, పంట బోదెల్లో నీటిమట్టాలు కనీస స్థాయికి పడిపోయాయి. నేరుగా భూములకు నీరు చేరే అవకాశాలు కానరావడం లేదు. దీంతో పలువు రైతులు ఇంజిన్లు బోర్లతో పొలాలకు నీటిని మళ్లించుకుంటున్నారు.

ఆచంట వేమవరంలో బీడు భూములుగా మారిన పంట పొలాలు

ఆచంట వేమవరం ఆర్అండ్‌బి రహదారికి ఇరువైపులా ప్రధాన పంట కాలువకు ఆనుకుని ఉన్న భూములు బీడువారడం గమనార్హం. సార్వా సీజన్లో ముంపు బారిన పడే ఈ పొలాలు ప్రస్తుతం నీరందక నాట్లకు నోచుకోలేదు. ఈ గ్రామంలో మరో 200 ఎకరాల పరిస్థితి ఇదే విధంగా మారడంతో రైతులు తల్లడిల్లుతున్నారు.

దమ్ముకు సైతం నీరందడం లేదు..

నేతల సంజీవరావు, కౌలురైతు, ఆచంట వేమవరం

గ్రామం మొత్తం ఆయకట్టుకు ప్రస్తుతం నీటిఎద్దడి తీవ్రంగా ఉంది. పంట కాలువలు, బోదెలు పూర్తిగా పూడుకపోవడంతో శివారు భూములకు నీరుచేరే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యంగా పాలకొల్లు ఆర్అండ్‌బి రహదారికి ఇరువైపులా ఉన్న ఆయకట్టుకు కూడా సాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. ఇదే పరిస్థితి కొనసాగి దమ్ము ప్రక్రియ కూడా ఆలస్యమైతే ఫిబ్రవరి మొదటి వారం వరకూ నాట్లు సాగే అవకాశం ఉంది.

ఇంజిన్లతో నీటిని తోడుకుంటున్నాం..

కోళ్ల భాస్కరరావు, కౌలురైతు, ఆచంట

రహదారి పక్కనే ఎనిమిది ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. నీరందక ఇంజిన్ల ద్వారా నీటిని తోడుకుంటూ దమ్ము చేయిస్తున్నాం. బ్యాంకు కెనాల్‌లో నీటిమట్టం తగ్గిపోవడం, పంట కాలువలు ఆక్రమణలకు గురికావడంతో పచ్చటి పొలాలు బీడు వారుతున్నాయి. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి ఎదురు కాలేదు. నీటి ఎద్దడి నేపథ్యంలో రైతులకు ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసి ఉచితంగా డీజిల్ సరఫరా చేయాలి. దమ్ముల దశ నుంచి బోరు నీరు ఇంజిన్లు వినియోగిస్తే ఖర్చు భారీగా పెరిగిపోతుంది.

అంగన్‌వాడీలకు కొబ్బరి నీళ్లు ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న గోపాలన్

విజయవాడ తరలిన అంగన్వాడీలు

అడ్డుకునేందుకు పోలీసుల యత్నం
అడుగడుగునా తనిఖీలు
పలువురుకి ముందస్తు నోటీసుల జారీ

ప్రజాశక్తి - భీమవరం

అంగన్వాడీలు తమ గోడును జగనన్నకు చెప్పుకునేందుకు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో ఆదివారమే విజయవాడ తరలివెళ్లారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ విశ్వ ప్రయత్నాలు చేశారు. దీన్ని అధిగమించి అంగన్వాడీలు విజయవాడ తరలివెళ్లినట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నేతలు తెలిపారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు గత 40 రోజుల నుంచి సమ్మెలో ఉన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ నిర్బంధాన్ని ప్రయోగించి భయపెట్టి విధుల్లోకి తీసుకొచ్చేందుకు ఎస్మాను సైతం ప్రయోగించింది. ఇవన్నీ ఎదురొడ్డి పోరాట పటిమను ప్రదర్శిస్తున్న అంగన్వాడీలు ఈ ప్రభుత్వానికి కనువిప్పు కల్గించేందుకు చలో విజయవాడకు సన్నద్ధమయ్యారు. దీనిలో భాగంగా జిల్లా నుంచి అంగన్వాడీలు వందలాది మంది తరలివెళ్లారు. ఆర్‌టిసి బస్సులు, రైళ్లలో ముందుగానే విజయవాడ బయల్దేరి వెళ్లారు. అయితే ఆదివారం నుంచే బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్సుల్లో సైతం తనిఖీలు చేశారు. భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం వంటి ప్రాంతాల్లో అంగన్వాడీల కోసం పోలీసులు జల్లెడపట్టారు. వీటన్నింటినీ అధిగమించి సుమారు 500 మందికిపైగా అంగన్వాడీలు విజయవాడ తరలివెళ్లారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఎంత నిర్బంధం విధించినా, అక్రమ అరెస్టులకు పాల్పడినా సమ్మె విరమించేది లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిఐటియు గణపవరం మండల అధ్యక్షులు ఎం.పెంటారావును పోలీసులు అరెస్టు చేసి స్టేషనుకు తరలించారు. అలాగే నరసాపురం రైల్వే స్టేషన్లో 22 మంది అంగన్‌వాడీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నరసాపురం రైల్వే స్టేషన్ వద్ద అంగన్‌వాడీలను అరెస్టు చేసిన పోలీసులు

భీమవరం రూరల్: జగనన్న నిన్ను గెలిపించి తప్పు చేశామని, మా సమస్యలు పరిష్కరిస్తావనుకున్నాం గానీ మమ్మల్ని రోడ్ల పాలు చేస్తావని అనుకోలేదని చెంపలను చేతులతో కొట్టుకుంటూ ఆదివారం అంగన్‌వాడీలు వినూత్న నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో 41 రోజు సమ్మె కొనసాగింది. ముందుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్వాడీలకు మద్దతు తెలుపుతూ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్ పట్టాభి రామయ్య, రాష్ట్ర కౌన్సిలర్ జివివి.రామాజరావు, జిల్లా కార్యదర్శులు సిహెచ్ కుమార్ బాబ్జి, బి.ఏసుబాబు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు వారికి కొబ్బరి నీళ్లు ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రామలక్ష్మి, మాధవి, జి.దమయంతి, మల్లేశ్వరి, సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పాల్గొన్నారు. అంగన్వాడీలు సహాయనిధిని సేకరించారు.



గణపవరంలో సిఐటియు మండల కార్యదర్శి పెంటారావును అరెస్టు చేసిన పోలీసులు

పోడూరు : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు ఆదివారం మండలంలోని గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, రాయుడు కుమారి, జె.ఉమాదేవి, పి.మంగ పాల్గొన్నారు.

ఆచంట : అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లేందుకు ఎటువంటి అనుమతులు లేవంటూ ఆదివారం సాయంత్రం ఆచంట పోలీసులు సిఐటియు మండల కార్యదర్శి వర్ధిపర్తి అంజిబాబును హౌస్ అరెస్ట్ చేసి నోటీసులు జారీ చేశారు.

వీరవాసరం : జారిస్టు రష్యాను సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్‌గా మార్చిన ప్రపంచ విప్లవ నేత విఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా వీరవాసరంలో అంగన్వాడీలు సమ్మె శిబిరంలో ఆదివారం లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. సమాజంలో ప్రజలందరూ సమానంగా ఉండాలని, అన్ని రకాల సదుపాయాలూ అందరికీ అందుబాటులో ఉండే విధానం అమల్లోకి తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి అని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. లెనిన్ శత వర్ధంతి సభలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయని, అందులో భాగంగా దేశంలో కూడా వివిధ ప్రాంతాలలో సభలు జరుగుతున్నాయని అన్నారు. సోషలిస్టు వ్యవస్థ లక్ష్యాలు, లక్షణాలను నేటి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పి.నాగరత్నం, శాంతి కుమారి, నాగపార్వతి, మంగ, దుర్గ పాల్గొన్నారు.

విప్లవ ప్రగతిపై లెనిన్‌ది చెరగని ముద్ర

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

భీమవరంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రపంచ కార్మిక విప్లవ ప్రగతిపై లెనిన్ చెరగని ముద్ర వేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద ప్రపంచ కార్మికవర్గ మహానేత, పీడిత ప్రజల విముక్తిప్రదాత, సోవియట్ విప్లవ రథసారధి లెనిన్ శత వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి బలరాం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేవలం 54 ఏళ్ల జీవితకాలంలో లెనిన్ మార్క్సిజం అనే సృజనాత్మక శాస్త్ర సారాన్ని సమగ్రంగా అవగాహన చేసుకుని, దాన్ని సమకాలీన సమాజ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దారన్నారు. రష్యన్ విప్లవాన్ని విజయపథం వైపు నడిపించిన గొప్ప విప్లవ మహానేత లెనిన్ అని కొనియాడారు. ప్రపంచంలో మొట్టమొదటి సోషలిస్టు దేశంగా సోవియట్ యూనియన్ ఆవిర్భవించడానికి లెనిన్ విప్లవ విత్తనాలు నాటి ప్రజలను, కార్మిక వర్గాన్ని దోపిడీ అంతానికి కార్యోన్ముఖుల్ని చేశారన్నారు. సమాజంలో బలమైన భౌతిక శక్తిగా కార్మిక వర్గం ఎదిగితేనే పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయగలమని బలరాం అన్నారు. ప్రజలంతా లెనిన్ నమ్మిన సిద్ధాంతంలో నడిస్తే కార్మికవర్గ సమాజాన్ని ఏర్పాటు చేయవచ్చున్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, బి.జార్జి, మామిడిశెట్టి రామాంజనేయులు, నేతలు మల్లిపూడి రామాంజనేయులు, త్రిమూర్తులు, వరలక్ష్మి, కోదండం పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం: ప్రపంచంలో మొట్టమొదటిసారిగా కార్మికరాజ్య స్థాపనకు బాటలు వేసిన వ్యక్తి లెనిన్ అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సభ స్థానిక పండ్ల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. తొలుత లెనిన్ చిత్రపటానికి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు కరెడ్ల రామకృష్ణ, పుట్టా యేసు, కోరాడ వెంకటేశ్వరరావు, తట్టాగొట్టి పెద్దిరాజు, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పెంటపాడు : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి సభ నిర్వహించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, సిఐటియు నాయకులు సిరపరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు, కర్రి సాయిరెడ్డి మాట్లాడారు. లెనిన్ చిత్రపటానికి బాబూరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గంటా కోటికరక వెంకట్రావు, ఆకుల నారాయణ, మద్దాల పుత్రయ్య, ఎస్‌విఎస్.రెడ్డి, పెనగంటి దుర్గ పాల్గొన్నారు.

తణుకు రూరల్: పేదరికం లేని సమాజం సృష్టికర్త లెనిన్ అని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. ఆదివారం స్థానిక అమర వీరుల భవనం వద్ద లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యాన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడగా నాయకులు గార రంగారావు, ఎం.గోవిందరాజు, సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

భీమవరం రూరల్: విప్లవోద్యమం ద్వారా రష్యాలో అసమానతలు, దోపిడీ లేని తొలి శ్రామిక రాజ్యాన్ని నెలకొల్పి, సోషలిస్టు సమాజ స్థాపనకు బాటలు వేసిన గొప్ప విప్లవకారుడు లెనిన్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆదివారం శ్రీనివాస థియేటర్ సెంటర్లో సిపిఐ స్తూపం వద్ద లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు సిహెచ్.రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, మల్లుల శ్రీనివాస్, కె.మల్లేశ్వరరావు, నాగిడి శాంతమూర్తి, ఛాన్‌భాషా, ఎం.యాకోబు, బంగారు దుర్గారావు, యేలేటి లూథర్, ధనాల సత్యనారాయణ, బంగారు మోహనరావు, కిలారి శివకుమార్, కె.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు కళారూపాలు దోహదం

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

సమాజంలో ప్రతిఒక్కరూ మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొంది ప్రశాంతతతో సంతోషంగా, ఆనందంగా మెలిగేందుకు చిత్రకారులు గీసే ఎన్నో కళారూపాలు దోహదపడతాయని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం బాపు ఆర్ట్స్ అకాడమీ, లయన్స్ కమ్యూనిటీ హాల్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన చిత్రకళ ప్రదర్శన, స్పాట్ పెయింటింగ్ ప్రదర్శన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ కళాకారులు ఎంతో శ్రమ, కష్టంతో గీసే ఎన్నో చిత్రాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతోపాటు సానుకూల ఆలోచనలకు అద్దంపడుతుంటాయన్నారు. తనకు చిత్ర కళాకారులు అంటే ఎంతో అభిమానం అని, తాను ఏ కార్యక్రమం తలపెట్టిన భాగస్వాములు అవుతుంటారని ప్రశంసించారు. బాపు ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిత్రకళా ప్రదర్శనలు ఏర్పాటు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎంఎల్ఎను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

చిత్ర కళా ప్రదర్శన సందర్శించిన ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కృష్ణమోహన్

తాడేపల్లిగూడెంలో జిల్లా అదనపు కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక కోర్టు ఆవరణలో 11వ జిల్లా అదనపు కోర్టును (ఎడిజె) హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఆదివారం ఉదయం ప్రారంభించారు. జిల్లా అదనపు కోర్టు జడ్జి సత్యవతి జడ్జి స్థానంలో ఆశీనులై కోర్టు సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు ఎవి.శేషసాయి, నినాల జయసూర్య, బిఎస్.భానుమతి, సత్తి సుబ్బారెడ్డి, వి.గోపాలకృష్ణరావు, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సి.పురుషోత్తమకుమార్ పాల్గొన్నారు. తొలుత న్యాయమూర్తులకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం నూతన కోర్టులో సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. ప్రజలు, న్యాయవాదుల సౌకర్యార్థం బార్ అసోసియేషన్ కార్యాలయంలో సబ్ పోస్టాఫీసును జడ్జిలు ప్రారంభించారు. అనంతరం కోర్టు భవనాల సముదాయం, అక్కడే ఉన్న సబ్ జైలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్యకిరణశ్రీ, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అన్నామణి, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అరుంధతి, తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.అప్పిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు శ్యాంప్రసాద్ ముఖర్జీ, శిరిగినీడి విజయకృష్ణ, మకా శ్రీనివాసరావు, దుర్గాదేవి, డిఎస్.రామారావు, హైకోర్టు న్యాయవాది ఎలిశెట్టి సోమరాజు, ఆర్‌డిఓ చెన్నయ్య, డిఎస్‌పి శరత్‌రాజ్‌కుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

సమస్యల పరిష్కారంలో వైసిపి విఫలం

మాజీ మంత్రి పితాని సత్యనారాయణ - 'ప్రజల వద్దకు పితాని' పాదయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - పెనుగొండ

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌కు, స్థానిక ఎంఎల్ఎ రంగరాజుకు ప్రజల గోడు పట్టదని, ప్రజా సమస్యల పరిష్కారంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, టిడిపి నేత పితాని సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం ఉదయం దొంగరావిపాలెంలో ప్రజల వద్ద పితాని పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ అరాచక పాలన సాగిస్తుందన్నారు. పాలకులను ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి గొంతు నొక్కుతోందని ఆరోపించారు. వాలంటీర్ల వ్యవస్థను అడ్డుపెట్టుకుని పాలకులు సంక్షేమ పథకాలు రద్దవుతాయంటూ విష ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, తాగునీరందించాలని కోరారు. అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అనర్హులకు పట్టాలు అమ్ముకున్నారని ఒక వృద్ధుడు వాపోయాడు.

టిడిపిలో పలువురు చేరిక

వైసిపి నుండి పలువురు టిడిపిలో చేరారు. దొంగరావిపాలెంలో మల్లుల శ్రీను, మామిడిశెట్టి రాంబాబు, మామిడిశెట్టి చంద్రయ్య ఆధ్వర్యాన పలువురు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆచంట జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఆచంట ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, టిడిపి గ్రామాధ్యక్షులు కడలి సత్యనారాయణ, ఎంపిటిసి పితాని శేఖర్, నేతలు కోనా రామలింగేశ్వరరావు, కోన వెంకటేశ్వరరావు, వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్, గుత్తుల లోకేష్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గం

కిళ్లీ, బీడీ, సిగరెట్, సోడా, కూల్ డ్రింక్స్ వర్తక సంఘం

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తణుకు

కిళ్లీ, బీడీ, సిగరెట్, సోడా, కూల్ డ్రింక్స్ వర్తక సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం తణుకులోని బీసీ కళ్యాణ మండపం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. సంఘం ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవం కూడా నిర్వహించారు. అనంతరం నూతన గౌరవాధ్యక్షులుగా బోయిడి అన్నవరం, అధ్యక్షులుగా పైబోయిన ఏసుబాబు, కార్యదర్శిగా గమిడి జయరాం వెంకటసుబ్బారావు, కోశాధికారిగా కొమ్మన రాంబాబు, ఉపాధ్యక్షులుగా పెదరెడ్ల ఈశ్వరరావు, చుండూరి సత్యనారాయణమూర్తి, సహాయ కార్యదర్శిగా శిరాలం శ్రీనివాసు, సుంకర వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వర్తక సంఘాల నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు. సంఘం బలోపేతానికి తమ సహాయ సహకారాలు అందించాలని నూతనంగా ఎన్నికైన ఏసుబాబు కోరారు.

వైసిపిని గద్దె దింపితేనే రాష్ట్రం అభివృద్ధి

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

'నేను ఉన్నాను నేను విన్నాను ఒక్క ఛాన్స్ ఇవ్వండి' అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ఇచ్చిన హామీలు మరిచి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి విమర్శించారు. ఆదివారం భీమవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సోషల్ మీడియా ఇన్‌ఛార్జిల సమావేశంలో సీతారామలక్ష్మి మాట్లాడారు. జగన్ పాలనలో ఆదాయం పెరగలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని తెలిపారు. అధిక ధరలతో బాధుతున్నారని విమర్శించారు. జగన్ ప్రవేశపెట్టిన భూ రక్షణ చట్టం భూ భక్ష చట్టంగా మారిందని, టిడిపి ప్రభుత్వం హయాంలోకి రాగానే భూరక్షణ చట్టాన్ని రద్దు చేస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న శిరిగినీడి రాజ్యలక్ష్మి

'జగన్‌ది నియంతృత్వ పాలన'

ప్రజాశక్తి - నరసాపురం

దళితులను జగన్‌రెడ్డి తన నియంతృత్వ పాలనతో అణచి వేస్తున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి విమర్శించారు. తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్ అభిమాని, జగన్‌కు మైలేజీ రావడం కోసం చిన్న కత్తితో సెంటిమీటర్ కూడా లేని గాయం చేస్తే అప్పటి రాష్ట్ర పోలీస్ వ్యవస్థ మీద నమ్మకం లేదని, హైదరాబాద్ సిటీ న్యూరో హాస్పిటల్‌కు వెళ్లి తొమ్మిది కుట్లు వేయించుకుని ఇదంతా చంద్రబాబు చేయించారని నానా యాగీ చేశారన్నారు. అధికారం కోసం కోడికత్తి దాడిని వాడుకుని అధికారం లోకి వచ్చాక పట్టించు కోలేదు సరికదా దళిత బిడ్డ శ్రీనుకు బెయిల్ కూడా రాకుండా కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. తల్లిని, చెల్లిని తన స్వలాభం కోసం వాడుకుని వదిలేసి ఇప్పుడు తన అధికారం కోసం కోడి కత్తి శ్రీనును కూడా వాడుకుని వదిలేశాడని తెలిపారు. శ్రీనును తక్షణం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా కమిటీ కార్యదర్శి అలవల తాయారు, సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ వల్లూరి మాధురి, చల్లా పద్మావతి, తోట అరుణ, తోట నాగమణి పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

లయన్స్ ఆధ్వర్యాన ఉచిత నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కడకట్లలోని జనతా ఛారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో వైస్ ప్రెసిడెంట్ భాపయ్య శర్మ ఆధ్వర్యంలో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వైద్య బృందంతో ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్ పదం కుమార్ గుప్తా (డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్) ఆర్థిక సహకారం అందజేశారు. శిబిరంలో 78 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు నిమిత్తం తొమ్మిది మందిని నిడదవోలుకు పంపారు. 27 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీజియన్ ఛైర్ పర్సన్ లయన్ మదన్ మోహన్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చిన్నం జగదీష్, జీడిగుంట హరిబాబు, ఎల్ఎస్‌వి.నాగేశ్వరరావు, పేరురి కాశియ్య, సుంకర శ్రీనివాస్‌రావు, సిహెచ్.వెంకటేశ్వరరావు, పచ్చా వెంకటేశ్వరరావు, పడాల మహేశ్వరరావు పాల్గొన్నారు.

పులపర్తివారితోటలో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

రామన్నపాలెం పంచాయతీ పరిధి పులపర్తి వారి తోటలో గుడవల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం అమ్మవారికి జాతర మహెూత్సవాలను నిర్వహిస్తారు. జాతర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అన్న సమాధిలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అన్న ప్రసాదం స్వీకరిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

వ్యర్థాలన్నీ కాలువలోనే..!

- జంతు కళేబరాలు, చెత్తాచెదారంతో దుర్వాసన
- పట్టించుకోని అధికారులు
- ప్రక్షాళన చేయాలని గ్రామస్తుల డిమాండ్

పంట కాలువలో కుక్క కళేబరం

ప్రజాశక్తి - ఉండి

మండల కేంద్రమైన ఉండి ప్రధాన పంట కాలువ జంతువుల కళేబరాలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. ఈ కాలువ ద్వారా సుమారు 35 గ్రామాలకు నీరు సరఫరా అవుతోంది. కొన్ని గ్రామాల్లో ఈ నీటిని నేరుగా మంచినీటి కుళాయిల ద్వారా సరఫరా చేయడంతో పలు గ్రామాల్లోని ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. పంట కాలువలో చెత్తాచెదారం, జంతు కళేబరాలతో పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు జల వనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడానికి వెళ్తుంటే అధికారులెవరూ ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో ఉండి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరిగేషన్ సిబ్బంది కనీసం ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. కాలువలో కుక్క కలేబరం కుళ్లిపోయి జాతీయ రహదారి పైకి దుర్వాసన వెదజల్లుతున్నా దాన్ని తీసే నాధుడు లేడని వాపోతున్నారు. వేసవి కాలంలో పంట కాలువను ప్రక్షాళన చేయడం ద్వారా చుట్టుపక్కల గ్రామాలకు రక్షిత నీరు అందుతుందని, అయితే పంట కాలువలను ప్రక్షాళన చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వవహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉండి పంట కాలువ నుంచి చనిపోయిన జంతు కళేబరాన్ని, చెత్తను తొలగించాల్సిందిగా స్థానికులు కోరుకుంటున్నారు.

చేతుల పరిశుభ్రత అవసరం

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

హ్యాండ్ వాషింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా ముఖ్యంగా చేతులు పరిశుభ్రత ఎంతో అవసరమని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. యూనిసెఫ్ మెప్మా ఆధ్వర్యంలో భీమవరం పురపాలక సంఘం పరిధిలో ఆదివారం హాండ్ వాషింగ్ స్టేషన్‌ను గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయటి నుంచి వచ్చే వ్యక్తులు అనేక వస్తువులపై చేతులు వేయడం వల్ల వాటికి ఉన్న దుమ్ము, ధూళితో క్రిములు కీటకాల వల్ల రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఆఫీస్‌కు వచ్చే ప్రజలు కరోన వంటి వ్యాధులు, ఇతర వ్యాధులు దరిచేరకుండా ఉండటానికి చేతుల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యామల, సిటీ మిషన్ మేనేజరు సిహెచ్.నానిబాబు, పట్టణ సమాఖ్య సభ్యులు కృపామణి, ఆర్‌పిలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

28న సభను జయప్రదం చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 28న రాజమండ్రిలో పాత పెన్షన్ సాధనకై సభ నిర్వహించనున్నామని, సభకు అన్ని రాజకీయ పార్టీల వైఖరి స్పష్టం చేయడం కోసం ఆహ్వానిస్తున్నామని, సభను ఉద్యోగ, ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయ రామరాజు, ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం కోరారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడారు. 2004 సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా చేరిన వారందరికీ పాత పెన్షన్ స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం అమల్లోకి వచ్చిందని, ఈ పథకం తమకు వద్దని పాత పెన్షన్ పునరుద్ధరించాలని పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధ్యాయులు పోరాటాలు చేశారని, చేస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. జిపిఎస్ విధానంలో 50 శాతం పెన్షన్‌కు అదనంగా డిఎ ఇస్తామని చెబుతున్నారని, సిపిఎస్ అయినా జిపిఎస్ అయినా ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టదాయకమన్నారు. రాజమండ్రిలో జరుగుతున్న పాత పెన్షన్ సాధనకై సభకు ఆహ్వానించి పాత పెన్షన్ విధానం అమలుపై వారి వైఖరి స్పష్టం చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఐదున్నర లక్షల మంది ఉద్యోగులకు వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేస్తూ చివరి వేతనంలో 50 శాతం పెన్షన్ గ్రాట్యూటీ చెల్లించేలా పెన్షన్ స్కీమును ప్రకటించాలని కోరుతున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగులు ఉపాధ్యాయులు ఈనెల 28న రాజమండ్రి సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు మాట్లాడుతూ అన్ని డివిజన్లలో, మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకుని, సభ జయప్రదానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సిహెచ్. పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు జి.లక్ష్మీ నారాయణ, పి.క్రాంతికుమార్, జి.రామకృష్ణంరాజు, డి.ఏసుబాబు, సిహెచ్.కుమార్‌బాబ్జి, రాష్ట్ర కౌన్సిలర్ జివివి రామానుజరావు, పాలకోడేరు మండల శాఖ ప్రధాన కార్యదర్శి కె.త్రిమూర్తులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

పాలకొల్లు : ఈ నెల 28న రాజమండ్రిలో పాత పెన్షన్ సాధనకై సభ నిర్వహిస్తున్నామని, సభను ఉద్యోగ, ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు పి.రాజశేఖర్ కోరారు. స్థానిక సమతా మహిళ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2004 సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా చేరిన వారందరికీ పాత పెన్షన్ స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం అమల్లోకి వచ్చిందని, ఈ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం తమకు వద్దని పాత పెన్షన్ పునరుద్ధరించాలని పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు చేశారని, చేస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. జిపిఎస్ విధానంలో 50 శాతం పెన్షన్‌కు అదనంగా డిఎ ఇస్తామని చెబుతున్నారని, సిపిఎస్ అయినా జిపిఎస్ అయినా ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టదాయకమని తెలిపారు. త్వరలో రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయని, ప్రతి రాజకీయ పార్టీ తాను అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తారు, మేనిఫెస్టో విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయిని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ అమలు చేస్తామని వారి మేనిఫెస్టోలో పెట్టాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తోందని చెప్పారు. 28న సభలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు జి.లక్ష్మీనారాయణ పి.క్రాంతికుమార్, రాష్ట్ర కౌన్సిలర్స్ ఎం.రాజశేఖర్, పిల్లి శ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి. శ్రీనివాస్, నాయకులు జి.ప్రకాశరావు, క్షేమమూర్తి, వి.జగ్గారావు, వి.సందీప్ కుమార్, బి. రాజు, సత్యనారాయణ, పి.రాంజీ అంబేద్కర్ పాల్గొన్నారు.

నిర్మాణదశలో ఉన్న వంతెన

రేకు పడవపై గొంతేరు దాటుతున్న రైతులు

ముందుకు సాగని వంతెన నిర్మాణం..!

రేకు పడవపైనే గొంతేరు దాటుతున్న రైతులు

ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కొత్తపాలెం పరిధిలో గొంతేరు డ్రెయిన్‌పై మూడేళ్ల కిందట చేపట్టిన వంతెన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం గొంతేరుపై వంతెన, వంతెనకు ఒక వైపు అనుసంధాన రహదారుల నిర్మాణానికి ఏసిఎన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎఐఐబి) రుణ సదుపాయం నిమిత్తం రూ.16.50 కోట్లు మంజూరు చేసింది. అప్పటి మంత్రి నారా లోకేష్ ఈ ప్రాంతాన్ని సందర్శించి వంతెన నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమి పూజ చేశారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం రివర్స్ టెండర్ విధానాన్ని అమలు చేసింది. ఈ విధానంలో మరో సార్లు టెండర్లు పిలిచారు. 2020లో వంతెన నిర్మాణానికి శాసనసభ్యుడు ముదునూరి ప్రసాదరాజు మంత్రులతో కలిసి భూమిపూజ చేశారు.

వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా గొంతేరు డ్రెయిన్‌కు కొంతమేర మట్టితో అడ్డుకట్ట వేశారు. అడ్డుకట్ట వేసిన ప్రాంతంలో కొంతమేర పునాది నిర్మించారు. రెండోవైపు నిర్మాణం ఇంకా ప్రారంభించలేదు. గొంతేరు కాలువ పెరవలి మండలం కాకుల ఇల్లింద్రపర్రు వద్ద ప్రారంభమై ముత్యాలపల్లి వద్ద ఉప్పుటేరులోకి కలుస్తుంది. దీనికి ఎగువ నుంచి వచ్చే మురుగునీరు, వర్షాల సమయంలో ముంపు నీరు ఈ కాలువ గుండా సముద్రంలో కలుస్తుంది. అయితే డ్రెయినుకు సగానికి పైగా మట్టితో అడ్డుకట్ట నిర్మించారు. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. నరసాపురం, వీరవాసరం, పాలకొల్లు తదితర ఎగువ మండలాల్లోని గ్రామాల్లో వరి చేలు, ఆక్వా చెరువుల్లోని ముంపునీరు బయటకెళ్లే మార్గం లేక అవి ముంపు బారిన పడుతున్నాయి. కొత్తపాలెంలో ప్రజల నివాసాలు ఒకవైపు, సాగు భూములు మరో వైపు ఉన్నాయి. రైతులు పొలాలకు వెళ్లాలంటే రోజుకు రెండు, మూడు సార్లు ఈ డ్రెయిను గుండా రేకుల పడవలపై వెళ్లాల్సి వస్తోంది.

వైసిపి ప్రభుత్వంలో ఆవిష్కరించిన శిలాఫలకం

రహదారి నిర్మాణానికి జరగని భూసేకరణ

శేరేపాలెం నుంచి వంతెన నిర్మాణ ప్రాంతం, అక్కడ నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కంసాలబేతంపూడి వరకూ రహ దారి నిర్మించాల్సి ఉంది. ఆయా ప్రాంతాల్లో ప్రయివేటు వ్యక్తుల వద్ద నుంచి భూమి సేకరించాలి. ఇప్పటి వరకూ ఆ ప్రక్రియ జరగలేదు. భూ సేకరణ జరగకుంటే అనుసంధాన రహదారి నిర్మాణం ప్రశ్నార్థకంగా మారనుంది.

నిలిచిన నిర్మాణం

కాంట్రాక్టరు ఇప్పటివరకూ చేసిన నిర్మాణానికి సంబంధించి బిల్లుల బకాయిలు ప్రభుత్వం చెల్లించలేదు. ప్రభుత్వం బకాయిలు చెల్లించేరకూ పనులు తిరిగి ప్రారంభమయ్యే పరిస్థితి లేదని ఆ సంస్థ ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో వంతెన నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తొందరలోనే నిర్మాణం..

సూర్యకుమార్, ఎఇ, పంచాయతీరాజ్ పిఐయూ విభాగం, పాలకొల్లు

వంతెన నిర్మాణంలో చోటుచేసుకున్న జాప్యం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుని తొందరలోనే వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూస్తాను.

మృతురాలు గంగాభవాని

ఆసుపత్రిలో మహిళ మృతి

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లేనంటూ బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జ్వరంగా ఉందని చికిత్స కోసం వచ్చిన మహిళకు ఇంజక్షన్ చేసిన కొద్దిసేపటికే మృతి చెందడంతో మృతురాలి బంధువులు ఆందోళన చేపట్టిన ఘటన పట్టణ శివార్లలో పాలకొల్లు రోడ్డులో ఉన్న ఒక ప్రయివేటు ఆసుపత్రి వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాలకోడేరు మండలం విస్సాకోడేరు వంకాయలపాలేనికి చెందిన కె.గంగాభవానీ జ్వరంతో బాధపడుతూ పట్టణ శివార్లలో ఉన్న జిఆర్‌కె ప్రయివేటు ఆసుపత్రికి ఆదివారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో వచ్చింది. ఆమెను వైద్య సిబ్బంది పరీక్షించి జ్వరం తీవ్రత 103గా ఉందని ఇంజక్షన్ చేసి అక్కడే ఉంచారు. ఇంజక్షన్ కొద్దిసేపటికే గంగాభవానీ ప్రాణాలు కోల్పోయింది. వైద్యుల్లేకుండా, సిబ్బంది నిర్లక్ష్యంగా చికిత్స చేయడం వల్లే గంగాభవాని ప్రాణాలు కోల్పోయిందంటూ బంధువులు రోదిస్తూ పాలకొల్లు-భీమవరం రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతురాలి బంధువులతో మాట్లాడారు. ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు, భర్త ఉన్నారు.

సాంబశివరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - ఆకివీడు

ధ్యాన, యోగ ప్రచారకులు, స్థానిక ఆదిత్య విద్యా సంస్థల అధినేత ఉండ్రమట్ల సాంబశివరావుకు డాక్టరేట్ లభించింది. యుఎస్‌ఎకు చెందిన యునైటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డు ప్రదానం చేసింది. న్యూ మాంక్స్ కుంగ్ ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో మెరినాగోల్డ్ 5 స్టార్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో సినీనటుడు మురళీమోహన్, జయసుధ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు సాంబశివరావు విలేకరులకు ఫోన్లో తెలిపారు. న్యూ మార్క్స్ కుంగ్ ఫూ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.విజయ్ కృష్ణ, తదితర ప్రొఫెసర్లు పలు రంగాల్లో సేవలందించిన వారిని డాక్టరేట్ అవార్డులకు ఎంపిక చేశారని చెప్పారు. ఆయన ధ్యాన, యోగా, తత్వ శాస్త్రాన్ని 25 సంవత్సరాలుగా పాఠశాల స్థాయి నుంచి ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పెద్దలకు 2000లకు పైగా, విద్యార్థులకు వెయ్యికి పైగా 'వ్యక్తిత్వ వికాసం'పై ఉచితంగా తరగతులు నిర్వహించారు. విద్యార్థులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దినందుకుగాను 'జ్ఞాన తత్వ శాస్త్రవేత్త'గా డాక్టరేట్ ఇచ్చి సత్కరించినట్లు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో పాడిన భక్తి పాటలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణరాజు పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రసాదరాజును సత్కరిస్తున్న సభ్యులు

ఘనంగా సత్తెమ్మ జాతర

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని సత్తెమ్మ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించారు. వెలిది వారివీధిలో ఉన్న సత్తెమ్మ అమ్మవారిని వెలిధి వారి ఆడపడుచుగా పూజిస్తారు. కెనల్ రోడ్లో ఉపసర్పంచి బోణం నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అమ్మవారికి జాతర నిర్వహించారు. కెనల్ రోడ్లో ఉపసర్పంచి బోణం నరసింహారావు ఆధ్వర్యంలో సత్యమ్మ అమ్మవారి జాతరను నిర్వహించారు. ఆయా జాతర్ల సందర్భంగా చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ శాసనసభ్యులు బండారు మాధవ నాయుడులు వేరువేరుగా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు

ముగిసిన కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని రుస్తుంబాద గోగులమ్మ ఉత్సవ కమిటీ, కొత్తపల్లి సోదరులు ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున స్టేడియంకు క్రీడాభిమానులు వచ్చారు. పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్‌పి రవిప్రకాశ్ చేతులు మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ పోటీలను మాజీ ఎంఎల్ఎ జానకీరామ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని పర్యవేక్షించారు.